# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 09-09-2024          సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- విజయవాడలోని వరద ముంపు ప్రాంతాల్లో ఈరోజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించారు.
- భారీ వర్షాలకు రాష్ట్రంలోని 1.81 లక్షల హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనా వేశామని అధికారులు వెల్లడించారు.
- వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం ఈరోజు ఒడిసాలోని పూరీ సమీపంలో తీరం దాటింది.
- ఉత్తర కోస్తాంధ్రలో భారీ వర్షాలున్నాయన్న సూచనల మేరకు రాబోయే 72 గంటలు జాగ్రత్తగా ఉండాలని హోం మంత్రి అనిత సూచించారు.
- విశాఖ జిల్లాలోని మేఘాద్రి గెడ్డ రిజర్వాయర్ పరివాహక ప్రాంతంలోని పరిస్థితి అదుపులోనే ఉందని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ స్పష్టం చేశారు.

========================

విజయవాడలోని వరద ముంపు ప్రాంతాల్లో ఈరోజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించారు. ఈ సందర్భంగా వరద బాధితులతో ఆయన మాట్లాడారు. వరద కష్టాలు తీర్చేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని, తనతో సహా మంత్రులు, అధికారులు రాష్ట్ర యంత్రాంగం మొత్తం ఈ సహాయక చర్యల్లోనే నిమగ్నమయ్యామన్నారు. గత తొమ్మిది రోజులుగా ప్రజలు పడిన బాధలు వర్ణనాతీతమన్నారు. బుడమేరుకు గండ్లు పడినా గత ప్రభుత్వం పట్టించుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. వరదల్లో నష్టపోయిన వారిని అన్ని విధాలుగా ఆదుకుంటామని, వారికి ఆదాయం వచ్చే మార్గాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి భరోసా ఇస్తూ....

(వాయిస్ 28 సెకన్లు)

========================

ఉత్తరాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలు, విజయవాడ వరద సహాయక చర్యలపై రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈరోజు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో రైతులకు అధికారులు అందుబాటులో ఉండాలని మంత్రి ఆదేశించారు. తీర ప్రాంతాల్లోని మత్స్యకారుల నివాస ప్రాంతాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, మత్స్యకారులను వేటకు వెళ్లకుండా సూచించాలన్నారు. మత్స్యకారుల పడవలను సురక్షిత ప్రాంతాల్లో ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రాష్ట్రంలో 1.81 లక్షల హెక్టార్లలో పంట నష్టం జరిగిందని ప్రాథమిక అంచనా వేశామని అధికారులు మంత్రికి వెల్లడించారు. అత్యధికంగా 1.39 లక్షల హెక్టార్లలో వరి పంటకు నష్టం జరిగిందని, 141 కోట్ల రూపాయల మేర మత్స్య సంపదకు నష్టం వాటిల్లిందని.. కృష్ణా, బాపట్ల, ఎన్టీఆర్ జిల్లాల్లో అధిక శాతం నష్టం జరిగిందని వివరించారు. మత్స్యకారులకు చెందిన 320 పడవలు పూర్తిగానూ, 61 పడవలు పాక్షికంగానూ, 257 వలలు దెబ్బతినడంతో పాటు, ఆరు జిల్లాల్లో మత్స్య సాగు చేసే ఇన్ ల్యాండ్ చెరువులు వరద ప్రభావానికి గురయ్యాయని మంత్రి తెలిపారు.

========================

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం ఈరోజు 10 గంటల 30 నిమిషాల నుంచి 11 గంటల 30 నిమిషాల మధ్య ఒడిసాలోని పూరీ సమీపంలో ఒడిశా తీరం దాటింది. ఈరోజు సాయంత్రం వరకు ఈ అల్పపీడనం యొక్క తీవ్రతను కొనసాగిస్తుందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఒడిశా అంతర్భాగంలో మరింత వాయువ్య దిశగా కదులుతూ, ఈరోజు అర్ధరాత్రి నాటికి క్రమంగా బలహీనపడి అల్పపీడనంగా మారే అవకాశం ఉందని వాతావకరణ శాఖ అధికారులు తెలిపారు. ఆ తర్వాత, ఇది అల్పపీడనంగా తదుపరి 24 గంటల్లో ఉత్తర ఛత్తీస్‌గఢ్ మీదుగా పశ్చిమ-వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉందని వెల్లడించారు. దీని ప్రభావంతో ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో రేపటి వరకూ భారీ వర్షాలు కురుస్తామని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు.

========================

కోస్తాంధ్రలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ సమాచారం నేపథ్యంలో హోం శాఖ, విపత్తుల నిర్వహణ శాఖలను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అప్రమత్తం చేశారు. ప్రధానంగా ఉత్తర కోస్తాంధ్రలో అతి భారీ వర్షాలున్నాయన్న సమాచారం నేపథ్యంలో రాబోయే 72 గంటలు జాగ్రత్తగా ఉండాలని మంత్రి సూచించారు. వంశధార, నాగావళి, బహుదా పరివాహక ప్రాంతాల ప్రజల ఫోన్లకు ఎప్పటికప్పుడు సందేశాలు పంపి అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు ఉత్తరాంధ్రలోని గోపాలపట్నం, కంచరపాలెం, అరకులోయ పరిసర ప్రాంతాలలో కొండ చరియలు విరిగిపడిన ఘటనలపై హోం మంత్రి విచారం వ్యక్తం చేశారు. విశాఖలోని జ్ఞానాపురం ఎర్రగెడ్డ, అల్లూరి సీతారామరాజు జిల్లాలో మత్స్యగెడ్డల నీటి ప్రవాహంపై ఎప్పటికప్పుడు వివరాలందించాలని అధికారులను ఆదేశించారు. ముంపు బారిన పడే అవకాశమున్న ప్రాంతాలలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి ఆదేశాలు జారీ చేశారు.

విరామం

========================

విశాఖపట్నం జిల్లాలోని మేఘాద్రి గెడ్డ రిజర్వాయర్ పరివాహక ప్రాంతంలోని ప్రజలు ఆందోళన చెందనవసరం లేదని, పరిస్థితి అదుపులోనే ఉందని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ స్పష్టం చేశారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పెందుర్తి మండలంలోని మేఘాద్రిగెడ్డ రిజర్వాయర్ స్థితిగతులను విశాఖ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు గణబాబుతో కలిసి కలెక్టర్ ఈ రోజు పరిశీలించారు. అనంతరం రిజర్వాయర్ పరివాహక ప్రాంతాలు, గోపాలపట్నంలోని పలు ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాత్రికేయులతో మాట్లాడుతూ, రిజర్వాయర్ నీటి మట్టం 61

అడుగులు కాగా, ప్రస్తుతం 57.4 అడుగుల మేర నీరు జలాశయంలోకి చేరిందని అన్నారు. ప్రస్తుతం పరివాహక ప్రాంతంలో వర్షాలు లేనందున ఎటువంటి ఇబ్బంది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.

========================

స్థానిక సంస్థల ఎన్నికలలోపు సమగ్రమైన ఓటర్ జాబితాను సిద్ధం చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ స్పష్టం చేసారు. ఈరోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులు, వివిద రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా తయారీపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కచ్చితమై జాబితా తయారు చేయడానికి రాజకీయ పార్టీలు సహకరించాలని అన్నారు. ఇంటింటికి ఓటరు నమోదు ప్రక్రియకు వెళ్లినపుడు 1,686 మంది అందుబాటులో లేరని, 390 మంది వేరే ప్రాంతాలకు వెళ్లారని, 1,387 మంది మృతి చెందారని తెలిపారు. 577 మంది ఓటర్ల ఫోటోలు సక్రమంగా లేవని, వాటిని సవరిస్తామని అన్నారు. నకిలీ ఓటర్లు, మృతి చెందిన ఓటర్లను జాబితా నుండి తొలగిస్తామని, ఓటరు నమోదుపై బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ అందిస్తామన్నారు.

========================

పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలంలో కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ఈరోజు పర్యటించారు. తుఫాన్ ప్రభావంతో జిల్లాలో పలు మండలాలలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. కొమరాడ మండలం రాజ్యలక్ష్మిపురం గ్రామం సమీపంలో ఉన్న జంఝావతి ప్రాజెక్ట్ వద్ద, పూర్ణపాడు-లాబేసు వంతెన వద్ద వరద పరిస్థితిని కలెక్టర్ పరిశీలించారు.

========================

విశాఖ-కిరండూల్ ఎక్స్ ప్రెస్ ను భారీ వర్షాల కారణంగా దారి మళ్లించామని వాల్తేరు సీనియర్ డివిజన్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. కొత్తవలస - కిరండూల్ మార్గంలో వర్షాల కారణంగా ఈనెల 11వ తేదీ వరకు విశాఖ - కిరండూల్ రాత్రి ఎక్స్‌ప్రెస్ వయా విజయనగరం, రాయగడ, కోరాపుట్ మీదుగా నడుస్తుందని ఆయన వెల్లడించారు. అదే విధంగా కిరండూల్ - విశాఖ రాత్రి ఎక్స్‌ప్రెస్ వయా కోరాపుట్, రాయగడ, విజయనగరం మీదుగా నడుస్తుందని సందీప్ పేర్కొన్నారు.

========================

విజయనగరం జిల్లాలో లారీ యజమానులు ఉచిత ఇసుక సరఫరాలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోరారు. ఈ రోజు కలెక్టర్ కార్యాలయంలో లారీ యజమానులతో సమావేశమై, నూతన ఇసుక విధానంపై అవగాహన కలిపించారు. లారీ యజమానులు ఆన్‌లైన్ ద్వారా వాహనాలను నమోదు చేసుకోవాలని, ఇసుక కోసం కూడా వినియోగదారులు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఉచిత ఇసుక విధానాన్ని క్రమబద్ధీకరించడానికి ప్రభుత్వం అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటోందని, ప్రజలకు మేలు చేకూరేలా సహకరించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

========================

ప్రకాశం బ్యారేజీ వద్ద దెబ్బతిన్న గేట్ల మరమ్మతు పనులను ఇంజనీరింగ్ అధికారులు పూర్తి చేశారు. 67, 69, 70వ గేట్ల వద్ద దెబ్బతిన్న కౌంటర్ వెయిట్ల స్థానంలో స్టీల్‌తో తయారు చేసిన భారీ కౌంటర్ వెయిట్లను ఇంజినీర్లు ఏర్పాటు చేశారు. నీటిపారుదల శాఖ ముఖ్య సలహాదారుడు కన్నయ్య నాయుడు పర్యవేక్షణలో ఈ మరమ్మతులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా కన్నయ్య నాయుడు పాత్రికేయులతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహకారం, ప్రోత్సాహంతోనే పనులు వేగంగా పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం ఈ మూడు గేట్లూ సమర్థవంతంగా పని చేస్తున్నాయని, రైతులకు నష్టం జరగకూడదనే రేయింబవళ్లు కష్టపడి పూర్తి చేశామని నాయుడు వెల్లడించారు. రాష్ట్రంలో లక్షలాది ఎకరాల్లో ఉన్న పంట పొలాలను రక్షించడం చాలా సంతోషాన్ని ఇచ్చిందన్నారు. కాగా.. రేపటి నుంచి బోట్లు తొలగింపు ప్రక్రియను అధికారులు ప్రారంభించనున్నారు.

=========================

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ అన్నారు. ఈ రోజు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో 315 అర్జీలు వచ్చాయని తెలిపారు. కాగా రాష్ట్రంలోని పలు వరద ప్రభావిత జిల్లాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారు.

=========================

=========================